వాగ్దేవి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

జీవితంలో భాగమైన ఫిజియోథెరపి

కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య

కాజీపేట, అక్టోబర్ 27 : సమాజంలో ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఫిజియోథెరపి భాగమైందని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య అన్నారు. నగరంలోని వాగ్దేవి విద్యా సంస్థలో ఆదివారం వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ముఖ్య అతిథిగా హాజరైన సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు ఫిజియోథెరపీలో ఉన్నత స్థాయిలో రాణజంచాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో దేశంలోని 21 కళాశాలలు పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌రెడ్డి ఫిజియోథెరపీలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి ప్రొఫెషనల్ ఎక్సలెన్స్, ఫిజియో ఎక్సలెన్స్, కళాశాల పూర్వ విద్యార్థులను అలుమ్ని అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ వాహినీదేవి, సింగపూర్ ఫిజియోథెరపి వైద్యురాలు డాక్టర్ అలెగ్జాండ్ లిచ్చి, శ్రీలంక పెరిండియార్ యూనివర్సిటీ డాక్టర్ మయూరన్, డాక్టర్ ఉజ్వల్, భట్టాచార్య, డాక్టర్ అమృత్ విశ్వాస్, డాక్టర్ భాస్కర్ రెడ్డి, థాయ్‌లాండ్ ప్రొఫెసర్ డాక్టర్ సరిచాన్ నూయి, డాక్టర్ ఫ్రెడరిన్, కన్వీనర్ డాక్టర్ చిరంజీవి, డాక్టర్ రాజమహేంద్ర, డాక్టర్ సాయి కిరణ్, విద్యార్థులు పాలల్గొన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి

భీమదేవరపల్లి, అక్టోబర్ 27: ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి చిన్నారి గడిపె అస్మిక (3) మృతిచెందిన విషాద ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని రత్నగిరిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గడిపె సంపత్, స్వర్ణలకు ముగ్గురు సంతానం. దినసరి కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రోజూ అస్మిక అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లేది. ఆదివారం కావడంతో ఇంటి వద్దే ఉండి తన అక్క, అన్నతో ఆడుకుంటున్నది. ఇంట్లోనే కళ్లు సరిగా కనిపించని అస్మిక తాత లింగయ్య ఉన్నాడు. వీళ్లంతా ఆ పాపను చూసుకుంటారని భావించి దంపతులు కూలీ పనికి వెళ్లారు. అస్మిక ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. అందులో పైవరకు నీళ్లు ఉండడంతో పెద్దగా శబ్దం రాలేదు. అటుగా వెళ్తున్న అస్మిక మేనత్త కూతురు సుశాంకిత నీటి సంపులో పడి ఉన్న బాలికను చూసి వెంటనే బయటకు తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. 108కి సమాచారమందించగా సిబ్బంది వచ్చి అస్మిక మృతి చెందినట్లు వెల్లడించారు. తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వంగర ఎస్సై దివ్య తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడికి యత్నం

ములుగు, అక్టోబర్27(నమస్తేతెలంగాణ): ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చేపల డబ్బాలను బస్సు డిక్కిలో వేసుకోవాలని సూచించిన ఆర్టీసీ కండక్టర్ వేణుపై దాడికి యత్నించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఆర్టీసీ కంట్రోలర్ ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నుంచి ఏటూరునాగారం బస్సు వెళ్తుండగా ములుగు మండలం జీవింతరావుపల్లికి చెందిన కొందరు మహిళలు చేపల విక్రయం అనంతరం డబ్బాలతో బస్సు ఎక్కారు. బస్సులో ఉన్న ప్రయాణికులు దుర్వాసన వస్తుందని కండక్టర్‌కు చెప్పగా చేపల డబ్బాలను డిక్కీలో వేసుకోవాలని మహిళలకు సూచించగా వారు వినలేదు. దీంతో కండక్టర్ బస్సులో ఉన్న ప్రయాణికులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించొద్దని, బస్సులో చేపల డబ్బాలు నిషేధమని హెచ్చరించాడు. అయినా వినకుండా సదరు మహిళలు అలాగే వస్తూ తమ కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించగా వారు ద్విచక్రవాహనాలపై ములుగు బస్టాండ్‌కు వచ్చారు. బస్సు అక్కడికి చేరుకోగానే కండక్టర్‌తో వాగ్వాదానికి దిగగా స్థానికులు కొందరు కండక్టర్‌ను తన్నండని రెచ్చగొట్టడంతో మహిళల కుటుంబసభ్యులు దాడికి యత్నించారు. తోటి ప్రయాణికులు, మరో బస్సు కండకర్, డ్రైవర్‌లు అడ్డుపడ్డారు. కాగా, ఈ విషయమై కంట్రోలర్ డయల్ 100కు ఫిర్యాదు చేయగా ములుగు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు సిబ్బందితో బస్టాండ్‌కు చేరుకొని సదరు వ్యక్తులను హెచ్చరించి వివరాలను నమోదు చేసుకొని పంపించారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

- కాళేశ్వరం వద్ద గోదావరిలో తరచూ ప్రమాదాలు
- శాపంగా మారుతున్న ఇసుక కోసం తీసిన గుంతలు
- తాజాగా వ్యక్తికి తృటిలో తప్పిన ప్రాణాపాయం
- అధికారుల తీరుపై భక్తుల అసహనం

ప్రమాదానికి గురైన వ్యక్తిని రక్షించి తీసుకొస్తున్న గంగపుత్రులు

కాళేశ్వరం, అక్టోబర్ 27: కాళేశ్వరం దేవస్థానం వద్ద త్రివేణి సంగమంలోని గోదావరి నదిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఇటీవల గోదావరిలో ఇసుక తవ్వేందుకు తీసిన గుంతలు ఇప్పుడు భక్తుల పాలిట శాపంగా మారాయి. కాళేశ్వరం దేవస్థానానికి వచ్చే భక్తులు తొలుత గోదావరిలో పుణ్య స్నానాలాచరించడం సంప్రదాయం. అయితే గోదావరిలో గుంతలుండడంతో భక్తులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆదివారం వరంగల్ నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు గోదావరిలో స్నానం చేస్తుండగా ఒక వ్యక్తి గుంతలో పడి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు నది ఒడ్డున లబోదిబోమంటూ రోదిస్తుండడంతో గమనించిన గంగపుత్రులు ఆ నీటి ప్రవాహంలోకి వెళ్లి అతడిని రక్షించి స్థానిక దవాఖానకు తరలించడంతో తృటిలో ప్రాణపాయం తప్పింది. అయితే గోదావరి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు కూడా లేవు. గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోదావరిలో ఇసుక కోసం తీసిన గుంతలతో ప్రమాదం ఉన్నప్పుడు కనీసం అక్కడ రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉన్నదని సూచిస్తున్నారు. అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్లు వ్యవహరించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన ఉండాలి

టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 27 : విద్యుత్ వినియోగదారులు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు జాగ్రత్తలను వివరిస్తున్నామన్నారు. గృహాల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడడం, రైతులు స్విచ్ బోర్డు, మోటర్ స్టార్టర్‌ల దగ్గర భద్రతా ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించక పోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన పొలంబాట కార్యక్రమం పూర్తి సత్ఫలితాలు ఇస్తున్నదని తెలిపారు. వదులుగా ఉన్న లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు, వంగిన పోల్స్ మారుస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లపై టోల్ ఫ్రీ నంబర్ 1912 రాయిస్తున్నామన్నారు. ఇటీవల చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ విద్యుదాఘాతంతో మరణించగా, అందుకు బాధ్యులైన జూనియర్ లైన్‌మెన్‌ను ఖమ్మం ఎస్ఈ సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. అలాగే ఏఈఫైనా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి విధుల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని, వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సంస్థ పరంగా తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఫిర్యాదులకు 24/7 టోల్ ఫ్రీ నంబర్ 18004250028,1912 అందుబాటులో ఉంటాయన్నారు. విద్యుత్ బిల్లులో పొందుపర్చిన సంబంధిత విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్, లైన్‌మెన్లకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవచ్చని సీఎండీ ఆ ప్రకటనలో వివరించారు.

కోటలో పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకలు

కోటలో పీడీఎస్‌యూ స్తూపాన్ని ఆవిష్కరించి అభివాదం తెలుపుతున్న న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, అరుణోదయ సంస్థ నాయకురాలు విమలక్క, నాగన్న, పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వీ సంధ్య, పూర్వ విద్యార్థులు

ఖిలావరంగల్, అక్టోబర్ 27: ఖిలావరంగల్ పడమర కోటలో పూర్వ పీడీఎస్‌యూ ప్రతినిధుల ఆధ్వర్యంలో పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ భవనంలో ఎదుట జెండాను ఆవిష్కరించారు. పడమర కోట మెట్టు దర్వాజ నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. పీడీఎస్‌యూ స్తూపాన్ని ఆవిష్కరించారు. వేదికపై అరుణోదయ రాష్ట్ర నాయకురాలు విమలక్క, నాగన్న పాడిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి. అర్ధ శతాబ్దపు వేడుకల నిర్వాహకులైన ఖిలావరంగల్ పూర్వ విద్యార్థులను న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు కే గోవర్ధన్ అభినందించారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వీ సంధ్య, పూర్వ పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వర్‌రావు, తీగల జీవన్, ఎస్ రవి, నలిగంటి విజయ్‌పాల్, బీకే, బైరబోయిన దామోదర్, బీ వెంకటేశ్వర్లు, రాచర్ల బాలరాజు, బీ నరసింహారావు, మొగిలి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కోతులనడుమలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

అండర్ పాస్ నిర్మించాలి

ఎన్‌హెచ్-563పై గ్రామస్తుల రాస్తారోకో

ఎల్కతుర్తి, అక్టోబర్ 27 : ఎన్‌హెచ్-563లో భాగంగా నిర్మిస్తున్న వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ కోతులనడుమ గ్రామస్తులు ఆదివారం సాయంత్రం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వల్భాపూర్, కోతులనడుమ గ్రామాల మీదుగా ఎన్‌హెచ్ ప్రధాన రహదారి వెళ్లింది. రెండు గ్రామాలు రెండుగా చీలిపోయాయి. ఈ గ్రామాల మీదుగా వీరనారాయణపూర్, దండేపల్లి, గోపాల్‌పూర్, ముల్కనూర్ తదితర గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రెండు గ్రామాల్లో అండర్‌పాస్‌లను నిర్మించాల్సి ఉంది. అయితే ఎన్‌హెచ్ అధికారుల తప్పిదం మూలంగా ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎన్‌హెచ్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో కోతులనడుమ గ్రామస్తులు ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకోకు దిగడంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.

నేడు భవిష్యనిధిపై అవగాహన సదస్సులు

న్యూశాయంపేట, అక్టోబర్ 27 : భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని జిల్లా కేంద్రాల్లో సోమవారం అవగాహన సదస్సులు, గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ ప్రాంతీయ కమిషనర్ దానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులను హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మాంటిస్సోరి హైస్కూల్, మహబూబాబాద్ జిల్లా మరిపెడ విద్యా హెర్బ్స్ ప్రైవేట్ లిమిటెడ్, జనగామ జిల్లా ఘన్‌పూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, భూపాలపల్లి జిల్లా గణపతి హైస్కూల్, ములుగు ఎన్పీడీసీఎల్‌లో ఏర్పాటు చేశామన్నారు. భవిష్యనిధి ఖాతాదారులు, ఉద్యోగులు తమ సమస్యలను వివరించి వెంటనే పరిష్కారం పొందొచ్చన్నారు.

లొంగిపోయిన మావోయిస్టు

ములుగురూరల్, అక్టోబర్ 27: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా సేంద్రబోర్ గ్రామం పామేడ పీఎస్ పరిధికి చెందిన ఆర్‌పీసీ అధ్యక్షుడు, మావోయిస్టు తాటి భామన్ ఆదివారం లొంగిపోయాడు. ఈ మేరకు ములుగు జిల్లా ఇన్‌చార్జి ఓఎస్డీ, డీఎస్పీ రవీందర్ వివరాలు వెల్లడించారు. భామన్ జనతన సర్కార్ జారపల్లి ఆర్‌పీసీ అధ్యక్షుడిగా పామెడ ఏరియా కమిటీ దక్షిణ డీవీసీలో పనిచేస్తున్నాడని తెలిపారు. 2004లో అప్పటి పామెడ దళ కమాండర్ ముఖేశ్ ప్రోద్బలంతో మిలీషియా సభ్యుడిగా పార్టీలో చేరాడని, అప్పటి నుంచి సీపీఐ మావోయిస్టుకు చెందిన వివిధ కమిటీల్లో పనిచేసి 2010లో జారపల్లికి చెందిన జనతన సర్కార్‌కు బదిలీ కాగా, 2019 వరకు అందులో సభ్యుడిగా ఉన్నాడన్నారు. అప్పటి అధ్యక్షుడు సోడి దేవా అరెస్టు తర్వాత అధ్యక్షుడిగా భామన్ ఎంపికై ఇప్పటి వరకు అందులోనే పనిచేశాడని వివరించారు. పార్టీలో పనిచేసిన సమయంలో పలు దాడుల్లో పాల్గొన్నాడని డీఎస్పీ వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఆదివాసీలపై చేస్తున్న హత్యాకాండ, అణిచివేతలపై విరక్తి చెంది, తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. దక్షిణ బస్తర్‌లో పోలీసుల దాడులు పెరిగినందున భార్య, ఆరుగురు పిల్లలతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని పోలీసుల ఎదుట లొంగిపోయాడని వివరించారు. ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ సూచన మేరకు మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలవాలన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు నగదు పారితోషికంతో పాటు ఉపాధి మార్గాన్ని ప్రభుత్వం చూపిస్తుందని, లొంగిపోయి కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితాన్ని గడపాలని సూచించారు.

పండక్కి బంగారం కొంటారా

గోల్డ్ హాల్‌మార్కింగ్ అంటే ఏమిటి? • ఎందుకిది ప్రధానం.. చార్జీలెంత!

దీపావళి పండుగ వేళ చాలామంది బంగారం కొంటూంటారు. ఇంకా చెప్పాలంటే మన దేశంలో ఇదో సంప్రదాయం.. అంతకుమించి ఓ సెంటిమెంట్. అవును.. ఈ పండక్కి పుత్తడి కొంటే లక్ష్మీ కటాక్షం దక్కినట్టేనని ఎంతోమంది నమ్మకం మరి. అయితే ఒకప్పటితో పోల్చితే ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నో రకాల మోసాలు జరుగుతున్నాయి. అమాయక కొనుగోలుదారులకు తక్కువ క్యారెట్ బంగారం అప్పజెప్పి ఎక్కువ సొమ్ము దండుకుంటున్న సంఘటనల్ని చూస్తూనే ఉన్నాం. అందుకే బంగారం నాణ్యతను తెలియజేసే ఎన్నో ప్రమాణాలను తీసుకొచ్చారు. అందులో ప్రధానమైనదే గోల్డ్ హాల్‌మార్కింగ్.

సంగతి..

కొనుగోలుదారుల్లో నమ్మకాన్ని కు బ్యూరో ఆఫ్ ఇండియన్ (బీఐఎస్) పరిచయం చేసినదే ఈ ల్‌మార్కింగ్ ప్రక్రియ. నగలు, కడ్డీలు ఇతరత్రా బంగారు ఉత్ప త్యతను తెలియపర్చడంలో ఇది ానం. దీని ప్రకారం ప్రతీ నగపై ార్క్, బంగారం నాణ్యతను తెలి 2 క్యారెట్ 916 ప్రమాణం, 6 జిటల్ హాల్‌మార్కింగ్ యూనిక్ ్‌యూఐడీ)లు ఉంటాయి. ఒక ఆభరణం మీద ఉన్న ఐడీ మరొక ఆభరణం మీద ఉండదు. సులభంగా ఆ ఐడీతో అన్ని వివరాలు తెలుస్తాయి. ఈ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం నగల అమ్మకందారులందరికీ తప్పనిసరి చేసింది.

బీఐఎస్ హాల్‌మార్క్

ఇది మీరు కొనే బంగారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ద్వారా నిర్వహించే లైసెన్స్‌డ్ లాబొరేటరీలో పరిశీలించబడినది అన్నదాన్ని సూచిస్తుంది. అలాగే ఇవి తాము అమ్మిన బంగారు ఆభరణాలని సూచించేలా కొందరు జ్యుయెల్లర్స్ తమ సొంత యూనిక్ ఐడెంటిఫికేషన్ మార్క్‌లనూ నగలపై వేస్తున్నారు. సాధారణంగా వారి బ్రాండ్లు, దుకాణాల పేర్లతో ఇవి ముడిపడి ఉంటున్నాయి.

ప్యూరిటీ

బంగారం నాణ్యతను క్యారెట్లలో కొలుస్తారు. 24 క్యారెట్ (99.9%) అంటే పూర్తిగా స్వచ్ఛమైన బంగారమే. మార్కెట్‌లో ఇది బిస్కట్లు, కడ్డీలు, నాణేల రూపంలో లభిస్తుంది. 22 క్యారెట్ (22K916) అంటే అందులో 91.6 శాతం నాణ్యమైన బంగారం ఉంటుందన్న మాట. మనం కొనే ఆభరణాలు ఈ నాణ్యతతోనే ఉంటాయి. అచ్చంగా పసిడితోనే నగలు తయారుకావు. అందుకే రాగి, ఇతరత్రా లోహాలను కలపాల్సి ఉంటుంది. దానివల్ల నాణ్యత కొంత తగ్గుతుంది. ఇక 18 క్యారెట్ (18K750) అంటే ఇందులో బంగారం 75 శాతం మాత్రమే ఉంటుంది. మిగతా 25 శాతం ఇతర లోహాలుంటాయి. 14 క్యారెట్ (14K585)లో బంగారం పరిమాణం 58.5 శాతమే. క్యారెట్ ప్రామాణికత తగ్గిన కొద్దీ ధరలూ తగ్గుతూంటాయి. అందుకే అత్యధిక ధరను పెట్టి కొనే నగలపై 22K916 ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.

చార్జీలు ఇలా..

మన దగ్గరుండే పాత బంగారు ఆభరణాలకూ హాల్‌మార్కింగ్ చేయించుకోవచ్చు. బీఐఎస్ నమోదిత జ్యుయెల్లర్స్ వద్దకు వెళ్లి వారి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. లేదా బీఐఎస్ గుర్తించిన అస్సేయింగ్ అండ్ హాల్ మార్కింగ్ సెంటర్ల (ఏహెచ్‌సీ)కు వెళ్లి అక్కడ ఈ పనిని చేసుకోవచ్చు. మీ నగల నాణ్యతను పరిశీలించిన తర్వాతే హాల్‌మార్కింగ్ జరుగుతుంది. చార్జీలు ఒక్కో బంగారు ఆభరణానికి రూ.45గా తీసుకుంటారు. వెండి వస్తువులకూ ఉంటుంది. అందుకు రూ.35 తీసుకుంటారు. కన్‌సైన్‌మెంట్ కోసమైతే కనీస చార్జీ బంగారానికి రూ.200, వెండికి రూ.150గా ఉంటుంది. వీటికి సర్వీస్ ట్యాక్స్, ఇతర చార్జీలు అదనం. బరువుతో సంబంధం లేకుండా ఈ చార్జీలు పడుతాయి. కొత్తవి షాపుల్లో కొంటున్నప్పుడైతే తయారీ, మజూరీ (మేకింగ్, వేస్టింగ్) చార్జీల్లో ఈ హాల్‌మార్క్ చార్జీలు కలువవు. వీటిని వేరుగా చెల్లించాల్సి ఉంటుంది. ఇక గతంలో నాలుగైదు సంకేతాలతో హాల్‌మార్కింగ్ ఉండేది. అదిప్పుడు మూడుకు తగ్గింది. కాబట్టి పాత హాల్‌మార్కింగ్‌కూ విలువ ఉంటుంది. అందులో హెచ్‌యూఐడీ లేదని ఆందోళన చెందనక్కర్లేదు.



రాబడి

చిన్న బ్యాంకు.. పెద్ద వడ్డీ

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో ఎఫ్‌డీలు అదుర్స్

సీనియర్ సిటిజన్లకు 9.50% వడ్డీరేటు

ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ).. రిస్క్‌కు దూరంగా, సురక్షితమైన పెట్టుబడికి చక్కని నిర్వచనం. అయితే ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం రాబడులు తక్కువ. కానీ కొన్ని బ్యాంకుల్లో ఎఫ్‌డీలపైనా ఆకర్షణీయ వడ్డీరేట్లున్నాయి. ఏకంగా 9 శాతానికిపైగానే వడ్డీ లభిస్తుండటం గమనార్హం. అవును.. సీనియర్ సిటిజన్లకు పలు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో గరిష్ఠంగా 9.50 శాతం వరకు వడ్డీరేటు వస్తున్నది.

- **నార్త్‌ఈస్ట్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  546-1,111 రోజుల (18 నెలల ఒక్క రోజు- మూడేండ్ల 16 రోజులు) కాల వ్యవధి ఎఫ్‌డీలపై అత్యధికంగా సీనియర్ సిటిజన్లకు 9.50 శాతం వడ్డీరేటు నిస్తున్నది. రూ.5 కోట్లలోపు ఎఫ్‌డీలకే వర్తిస్తుంది. ఈ ఏడాది జూన్ 25 నుంచి ఈ రేటు అమల్లోకి వచ్చింది.
- **సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  రెండేండ్ల నుంచి మూడేండ్లదాకా చేసే ఎఫ్‌డీలపై సీనియర్ సిటిజన్లకు ఇక్కడ 9.10 శాతం వడ్డీరేటు ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4 నుంచి వర్తిస్తున్నది.
- **యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  సీనియర్ సిటిజన్లకు 1,001 రోజుల ఎఫ్‌డీపై 9.50 శాతం వడ్డీరేటు, 701 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేటును ఈ బ్యాంక్ ప్రకటించింది. ఈ నెల 7 నుంచే ఇవి అమల్లోకి వచ్చాయి.
- **ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్**
  1,001 రోజుల ఎఫ్‌డీపై 9.10 శాతం, 1,500 రోజుల ఎఫ్‌డీపై 9.25 శాతం వడ్డీరేట్లను సీనియర్ సిటిజన్ల కోసం ఈ బ్యాంక్ ఇస్తున్నది. ఈ ఏడాది జూన్ 7 నుంచి ఈ రేట్లు అమలవుతున్నాయి.

అదనపు సౌకర్యాలు

చాలా బ్యాంకులు సీనియర్ సిటిజన్లకు ఎఫ్‌డీలపై అదనపు వడ్డీరేట్లను అందిస్తున్నాయి. ఫిక్స్‌డ్ చేసే మొత్తాల ఆధారంగా ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో 0.50 శాతం నుంచి 0.75 శాతం మేర ఎక్కువ వడ్డీరేట్లు అమలవుతున్నాయి. అంతేగాక వృద్ధులకుండే సమస్యలు, ముఖ్యంగా ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఎఫ్‌డీలపై రుణాలనూ బ్యాంకర్లు ఇస్తున్నారు. అయితే చేసే ఎఫ్‌డీలపై ఈ రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. పెద్ద ఎఫ్‌డీలపై అంతే మొత్తాల్లో రుణ సదుపాయం దొరుకుతుంది. ఈఎంఐల్లో ఈ లోన్లను తీర్చుకోవచ్చు. ఇక అత్యవసరాల దృష్ట్యా ఎఫ్‌డీల ముందస్తు ఉపసంహరణలకూ కొన్ని సంస్థలు అనుమతినిస్తున్నాయి. అయితే ఇందుకు స్వల్ప మొత్తాల్లో జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏండ్లు, ఆపై వయసుగలవారు తమ ఎఫ్‌డీలపై పొందే వడ్డీ ఆదాయానికి టీడీఎస్ మినహాయింపు కోసం సెల్ఫ్ డిక్లరేషన్ ఫామ్ 15హెచ్‌ను సమర్పిస్తే ప్రయోజనాన్ని అందుకునే అవకాశాలున్నాయి. ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 197ఏ, సబ్‌సెక్షన్ 1సీ ఇందుకు వీలు కల్పిస్తున్నది. వడ్డీరేట్లు, కాల వ్యవధి, ఇతర ప్రయోజనాలు సీనియర్ సిటిజన్లకు అత్యుత్తమ ఎఫ్‌డీ ఏది అనేది నిర్ణయిస్తాయి. కాబట్టి ఎఫ్‌డీని తీసుకొనే ముందు దాని ఫీచర్లను గమనించాలి.

అమ్మకాల ఒత్తిడిలోనే..

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దేశ, విదేశీ అననుకూలతల మధ్య మదుపరులు పెట్టుబడులకు దూరంగానే ఉంటున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,822.46 పాయింట్లు లేదా 2.24 శాతం పడిపోయి 79,402.29 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 673.25 పాయింట్లు లేదా 2.70 శాతం పతనమై 24,180.80 దగ్గర ముగిసింది. ఈ క్రమంలో ఈ వారం కూడా అమ్మకాల ఒత్తిడికే అధిక అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను కార్పొరేట్ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు మునుపటిలాగే మార్కెట్ ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిస్థితులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, ముడి చమురు ధరలు ఎప్పట్లాగే ఈసారీ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 మధ్యకు వెళ్లవచ్చని చెప్తున్నారు.



గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఈ రంగాలపై ఓ లుక్కేయండి

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకు అవకాశాలున్నవివే

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు పెట్టాలని మీరు యోచిస్తున్నట్టైతే.. అందుకు ఈ దీపావళియే సరైన సమయమని మెజారిటీ మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. పైగా కొన్ని రంగాలను పరిశీలించాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. వాటిలో మధ్య-చిన్న శ్రేణి ఐటీ కంపెనీలు, దేశీయ ఫార్మా సంస్థలు, పాత ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, టైర్ల తయారీ సంస్థల స్టాక్స్ అనుకూలంగా ఉన్నట్టు చెప్తున్నారు. అయితే ప్రస్తుతం మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. పలు దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. దీంతో చిన్నచిన్న మొత్తాల్లో పెట్టుబడులకు దిగాలని కూడా ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. ఇందుకోసం సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)ను ఎంచుకోవడం ఉత్తమమని అభిప్రాయపడుతున్నారు. వీక్లీ, మంత్లీ, త్రైమాసిక పద్ధతుల్లో పెట్టుబడులకు వీలుంటుందని, వెయ్యి రూపాయలతో కూడా మదుపును మొదలు పెట్టవచ్చంటున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సిప్‌ల్లోకి నిధుల వరద మునుపెన్నడూ లేనివిధంగా రూ.24,509 కోట్లుగా ఉండటం గమనార్హం. మొత్తానికి ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షణీయ రాబడులకు ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులు స్టాక్ మార్కెట్ రిస్కులకు లోబడి ఉన్నందున నిపుణులను సంప్రదించి పెట్టుబడులకు దిగితే ఇంకా లాభించవచ్చు. అంతేగాక స్వల్పకాలిక పెట్టుబడుల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులు కలిసొస్తాయన్న వాదనలూ ఉన్నాయి.